

# సావిత్రి కోసం కోసం

సావిత్రీ—సావిత్రీ

ఇంట్లోంచి అమ్మ కేక వినిపించింది, బయట గంగిరెద్దు ఆట చూస్తూ కూర్చున్న నాకు. పరుగెత్తాను లోపలికి

"ఎందుకమ్మా పిలిచావు''—

"ఏం చేస్తున్నావే బయట. అక్కయ్యేది "—

''మేడమీద నిద్ర పోతుందమ్మా.''—

"దీని కెంత సేపూ నిద్రే. నాన్న సాయంత్రం ఆరింటికిగాని రారు, బండి నాలిగింటికే వచ్చేస్తుంది. ఎట్లాగో ఏమిటో.''—మా అమ్మ ఎందుకంత హడావిడి చేస్తుందో అర్థంకాలేదు నాకు. చేతిలో పోస్టుకార్డు మాత్రం వుంది.

''ఏమిటమ్మా అలా కంగారు పడుతున్నావు. బండి కెవ రొస్తున్నా రేమిటి?'' అని అడిగాను.

''మీ బావ వస్తున్నారే—రేపు. అక్కయ్యను లేపు. వెళ్ళి భీమశంకరాన్ని పిలుచుకురా''

భీమశంకరం మా ఎదుటింటిలో వుంటాడు. పాపం చాలా బీదవాడు. కాని బొమ్మలు బాగా గీసేవాడు. మా నాన్నే స్కూల్లో స్కాలర్‌షిప్ యిప్పించి చదివించేవారు. అడపా దడపా మా యింటికి వస్తుంటాడు. ఏదైనా అవసరమైన పనివుంటే నాన్న అతనికి చెప్పి చేయించేవారు. అందుచేతే అమ్మ అతన్ని స్టేషనుకు వెళ్ళి బావగార్ని తీసుకుమర్మని చెప్పడానికి నన్ను పిలుచుకు రమ్మంది.

భీమశంకరాన్ని పంపించి—అమ్మ అక్కయ్యకు జడవేస్తూ ఏదో సణుగుతుంది. నేను ఊరికే ప్రక్కన నిలబడి చూస్తున్నాను.

యస్. వి. రంగారావు

"అలా కళ్ళప్పచెప్పి చూస్తూ నిల బడకపోతే తెపాళాలో మల్లెమొగ్గ లున్నయి. తీసి గుచ్చరాదు'' అని నన్ను కసిరింది.—అరుగుమీద కూర్చొని మల్లె మొగ్గలు గుచ్చుతూ అమ్మ నడిగాను —

"అమ్మా! బావ వస్తున్నాడు కదూ— ఇవాళన్నా నన్ను పువ్వులు పెట్టుకో నియ్యవే" అని.

"ఛా నోర్మూయ్—నీ కేమన్నా మతుందా లేదా—పైగా అరుగుమీద నుంచి అరుస్తా వేమే గాడిదలా—లోపలకు రా" — ఇది వరలో ఒకటి రెండుసార్లు నేను పువ్వులు పెట్టుకుంటానని అడగడం, మా అమ్మ నన్ను తిట్టడం జరిగింది. కాని యివాళ బావ వస్తున్నాడుకదా, ఇవాళ పెట్టుకుంటే ఏమి? నా కర్థం కాలేదు.

ఇంటిముందు జట్కా ఆగింది. మా అక్కయ్య తారాజువ్వలా లోపలకు పరు గెత్తింది. మా అమ్మ ముఖం ఎంతో సంతోషంగా వుంది. బండిలోంచి భీమశంకరం మాత్రం దిగాడు. తరువాత బావ దిగుతాడేమోనని ఆశగా చూశాం.

"బండంతా వెతికాను. ఎక్కడా కన పడలేదు అత్తగారు,'' అంటూ నవ్వు కుంటూ వచ్చాడు భీమశంకరం, పెద్ద ఘనకార్యం చేసి వచ్చినవాడిలాగ—

నాకు వళ్లు మండిపోయింది.

"బండంతా బాగా వెతికావా'' అని మా అమ్మ గుచ్చి గుచ్చి అడిగింది. "చూశా నత్తయ్యగారు, ఎక్కడా కని పించలేదు."—లోపలకు వెళ్ళేసరికి మా అక్కకు ఈ సంగతి తెలిసినట్టుంది— ముఖమంతా కందగడ్డలా ఎఱ్ఱబారింది. తలలో పెట్టుకున్న మల్లెపువ్వుల చెండు తీసి క్రింద గిరాటేసింది. తలంతా చెరి పేసుకుంది. మా నాన్న స్కూలునుంచి వచ్చేసరికి యిల్లంతా ఏదో విచారమైన సంఘటన జరిగిపోయినట్లు నిశబ్దంగా వుంది. నేనే నాన్న దగ్గరకు పరుగెత్తికెళ్ళి "నాన్నా! బావ దగ్గర్నుంచి ఉత్తర మొచ్చింది ఇవాళొస్తున్నట్లు.భీమశంకరం స్టేషనుకు వెళ్ళాడు, కాని బావ రాలేదు; అక్కయ్యకు కోపం వచ్చింది; అమ్మ నన్ను తిట్టింది," అని యేకరువు పెట్టేశాను ఒక్కసారే. నాన్న చిరునవ్వు నవ్వుతూ లోపలకు వచ్చి అమ్మతో మాట్లాడుతూ కూర్చున్నాడు.

నేను మాత్రం అరుగుమీదే కూర్చు న్నాను. ఇంకా బావ వస్తాడనే నా ఆశ అక్కయ్య విసిరి పారేసిన మల్లెచెండు ఎప్పుడుతీశానో నాకుతెలియదుగాని నా చేతి లోనే వుంది. అమ్మ నన్ను లేపేటప్పటికి బాగా చీకటిపడింది.ఇంట్లో దీపాలు వెలిగిం చారు. లోపలకు తీసుకొనిపోయి భోజనం పెట్టి మేడమీదకెళ్ళి పడుకోమంది. కాని నాకు నిద్రపట్టలేదు. అక్కయ్య గదిలోకి వెళ్ళాను. అక్కయ్య లేదు. పందిరి మంచం ఎంతో చక్కగా వుంది. తెల్లని దుప్పటి వేసివుంది. ఎదురుగుండావున్న అద్దం ముందు నిలబడి చూచుకున్నాను

నేనుకూడా దగ్గర దగ్గర అక్కయ్యంత ఎత్తున్నాను. గబగబ పెట్లోంచి దావాణీ తీసి వేసుకున్నాను. చేతిలోవున్న పువ్వులు, యిందాక అక్కయ్య పారేసినవి, తల్లో పెట్టుకున్నాను. బాగానేవుంది కాని ఏదో లోపం కనిపిస్తుంది నా ముఖంలో—ఆ... జ్ఞాపక మొచ్చింది. బొట్టు పెట్టుకోలేదు. అక్కయ్య బొట్టుబరణి తెరిచి చక్కగా యింత కుంకంబొట్టు పెట్టుకున్నాను. నా ముఖం నాకే ఎంతో అందంగా కనుపించింది. ముగ్ధురాలినై పోయాను. అంత అందంగా వుంటానని నేను ఎప్పుడూ అనుకోలేదు. అందుకనే కాబోలు మా అమ్మ, అక్కయ్య నన్ను ఎప్పుడూ బొట్టు, కాటుక పెట్టుకోనిచ్చేవారు కారు చుప్పనాతివాళ్ళు. అసలు నేను బొట్టు, కాటుక పెట్టుకోవడంగాని — పువ్వులు పెట్టుకోవడంగాని యింట్లో ఎవరికీ యిష్టముండేది కాదు. ఒక్క భీమశంకరానికితప్ప. అతనే అంటూ వుండేవాడు అప్పుడప్పుడు. ''సావిత్రీ! నువ్వు బొట్టు కాటుక పెట్టుకుంటే ఎట్లా వుంటావో తెలుసా—సాక్షాత్తు లక్ష్మిలా వుంటా''వని. అలా మంచంమీద అద్దంలో అందం చూసుకుంటూ కూర్చున్నాను. ఎప్పుడు నిద్రపట్టిందో తెలియదు.

బావకు మెయిలు అందలేదట. అందుకని దొంగల బండిలో వచ్చాడట రాత్రి ఒంటిగంటకు. మా అమ్మే తలుపు తీసిందట. సరాసరి నే పడుకున్న గదిలోకే వచ్చాడు. (అంటే బావ వచ్చినప్పుడల్లా అక్కయ్య, తనూ ఆ గదిలోనే చేరుకుంటారు) నన్ను చూచి అక్కయ్యనుకొని—పిర్రమీదకొట్టి లేపాడు. నేను నిద్ర లేచి చూచేటప్పటికి నన్ను చూచి ఖంగారు పడ్డాడు.



"నీది కఠినశిక్ష. ఏం పని చేస్తావ్ ?"
''రెండు రోజులు గడువిస్తే మీ సంతకాలు నేనే చేస్తా."

"నువ్వా ! నేను సరళేమో అనుకున్నాను. ఇదేమిటి ఈ వేషం. నీకీ పువ్వులెవరు పెట్టారు. ఆ బొట్టేమిటి ఛీ! ఛీ అన్నాడు. నాకు వళ్ళు మండిపోయింది.

''ఏమిటి బావా నువ్వు కూడా అలాగే అంటావు. అక్కయ్య, అమ్మ, కూడా నన్ను అలాగే తిట్టారు. నీకు కూడా కష్టంగా వుందా నేను పువ్వులు పెట్టుకుంటం '' — అన్నాను. పాపం జాలి ముఖంతో ఏదో చెప్ప బోయాడు.

ఈ లోపల మా అమ్మ లేపి పంపించింది కాబోలు, మా అక్కయ్య గదిలోకి వచ్చి నన్ను చూచి నిర్ఘాంతపోయింది. రెండు తిట్టి బయటకు పొమ్మంది. ఏడుపు ముఖంతో క్రిందకు వచ్చేసరికి మా అమ్మ చూచి నా చెంపలు పగలగొట్టి తిట్టడం ప్రారంభించింది అప్పటికే ఉడికిపోయి వున్నానేమో—వళ్ళు మండిపోయి "ఏం. నువ్వుమాత్రం పెట్టుకోవచ్చు పువ్వులు అక్కయ్య తలనిండా అన్ని పెట్టావు కదా—నేను పెట్టుకుంటే మాత్రం అలా ఏడుస్తారే యిద్దరూనూ" అని ఏడుస్తూ అనేశాను. ఆ దెబ్బతో ఏ మనుకుందో ఏమో—మా అమ్మ కళ్ళంట నీళ్లుపెట్టు కొని నన్ను దగ్గరగా లాక్కుంది

నన్ను తిట్టమని ఎవరు చెప్పారు—యిలా ఏడవమని ఎవరు చెప్పారు నాకేమీ అర్థంకాలేదు

* * *

పది సంవత్సరాలు గడచాయి అక్కయ్య అత్తవారింటికి వెళ్ళి పోయింది. నాన్నపోయి రెండేళ్ళయింది. ఇప్పుడింట్లో అమ్మ, నేను తప్ప మరి మగదిక్కు లేదు. భీమశంకరం కూడా నాన్న పోకముందే పైచదువుకని చెన్నపట్టణం వెళ్ళిపోయాడు. మళ్ళీ కనుపించలేదు అతను వెళ్ళిపోయిన మొదట్లో నాకు చాలా బెంగగా వుండేది. తరువాత ఎప్పుడో ఒకరోజు పేపర్లో అతని ఫోటో చూచాను. అతనికి ఆలిండియా డ్రాయింగ్ కాంపిటీషన్‌లో ఫస్టుప్రయిజు వచ్చిందని వేసివుంది ప్రక్కనే అతను వేసిన బొమ్మకూడా వుంది. చక్కటి ఒక స్త్రీ బిందెతో నీళ్ళు తెస్తున్నట్లు వేశారు. తేరిపార చూశాను అది నా ముఖమే "ఆనాటి సావిత్రి" అని దానికి పేరు పెట్టాడు అప్పు డనుకున్నాను—నేనంటే అతనికి ఎంతో ప్రేమ వుందని. కాని అతనెక్కడో—నేనెక్కడో—మళ్ళీ అతన్ని కల్సుకొనే అవకాశమే లేదు. ఆశ వదులుకున్నాను క్రమేపీ అతనిని మరచిపోయాను కూడా. నాన్న వున్నప్పుడు ఎంతో కళకళ లాడుతూ వుండిన అమ్మముఖం యిప్పుడు దిగాలుపోయి ఎప్పుడూ విచారంగానే కనిపించేది నాకు.

నాకు కొంచెం వయస్సు వచ్చిన తరువాతగాని తెలియలేదు నా విషయం. నాకు అక్కయ్యకూ చిన్నప్పుడే, అంటే ఏడు ఎనిమిదేళ్ళ వయస్సులలోనే మా బామ్మ ప్రేరేపణమీద పెళ్ళిళ్ళు చేశారట. పెళ్ళయి సంవత్సరం తిరగకముందే నా భర్త స్ఫోటకంవచ్చి చనిపోయాడట. ఇది నా గాథ. అంధకార బంధురమైన ఈ మొండి జీవితాన్ని ఇలాగే గడుపుతున్నాను.

నిండు యౌవ్వనంలో వున్నాను. ఎప్పుడూ సోమరితనంగా కూర్చోడం చాలా కష్టమనిపించింది. ప్రయివేటుగా చదువుకుంటూ—స్కూలు ఫైనలు

ప్యాసయ్యాను. పై చదువుకు యింట్లో డబ్బులేదు. నాన్న సంపాదించిన డబ్బుతో యింతకాలం సురక్షితంగా జరిగింది. యికముందు భోజనానికే ఎలాగా అని అనుకుంటున్నప్పుడు – పై చదువు చదవడానికి ఎలా వీలవుతుంది. పైగా యింట్లో ఖర్చుకు కూడా ఏదైనా ఆదాయం చూడవలసి వచ్చింది. భూమి మీద వచ్చే గింజలతో భోజనం గడిచేది.

ఒక రోజు అమ్మతో అన్నాను. "ఏదైనా ఉద్యోగం చేస్తానమ్మా ఏమీ చేయకుండా యింట్లో కూర్చోడం చాలా కష్టంగావుంది. ఏమనుకుందో ఏమో 'సరే' అంది అమ్మ.

ఏ ఉద్యోగానికి ప్రయత్నించినా పూర్వానుభవం కావాలనేవారు. అసలు ఉద్యోగం దొరక్కముందు ఆ అనుభవం రాదని వాళ్ళకు తెలియదు కాబోలు! నీటిలో దిగితేగాని ఈతరాదు. ఈత వస్తేనేగాని నీటిలో దిగవద్దంటే యెట్లా.

వేరే ఉద్యోగం దొరకక విసుగు పుట్టి ఆఖరికి నర్సు ట్రయినింగుకు వెళ్లాను. మొదట్లో మా అమ్మ ఒప్పుకోలేదుగాని– తరువాత నా పట్టుదలవల్ల – పరిస్థితుల ప్రాబల్యంవల్ల ఒప్పుకోక తీరలేదు.

చాలా కాలం ఆ వూరులో చేసి చివరకు రాజమండ్రి గవర్నమెంటు హాస్పిటల్‌లో స్టాఫ్ నర్సుగా పోస్టు చేయబడ్డాను. ఒక సంవత్సర మయింది. రామచంద్రరావు గారని మా డాక్టరుగారు చాలా మంచివారు – ఉదార స్వభావులు. ఆయనను కాకినాడ బదిలీ చేశారని తెలిసి నర్సులందరమూ పార్టీ యేర్పాటు చేశాము. ఆ సందర్భములో ఆయన మాట్లాడుతూ–మేమందరమూ ఆయనకు చేసిన సహాయానికి మెచ్చుకుంటూ – క్రొత్త డాక్టరు పి. బి. శంకరంగారు నేటిరోజు వచ్చి జాయినవుతారని – చాలా మంచివారని, కాని చాలా స్ట్రిక్టుగా వుంటారని జాగ్రత్తగా వుండాలని చెప్పారు. ఆ రోజు నుంచి నాకు రాత్రి డ్యూటీ అవడంచేత – క్రొత్త డాక్టరును కలుసుకొనే అవకాశము లేకపోయింది. నేను హాస్టలుకు వచ్చేటప్పటికే ఆయన వెళ్ళిపోతుండేవాడు. ఈవారం రోజులలో ఆయన గురించి మిగతా నర్సులంతా వింత వింతగా మాట్లాడుకొనేవారు చాలా అందగాడని – చలాకీగా వుంటాడని – యింకా పెళ్ళి కాలేదని–ముఖ్యంగా మా తోటి నర్సు మిస్. రాణి ఆయనతో చనువుగా వుంటుందని తెలిసింది. ఆ పిల్ల యెప్పుడూ అంతే–కొత్తాలేదు పాతాలేదు. పైగా డాక్టర్లను మంచిచేసుకొని త్వరగా స్టాఫ్ నర్సు కావాలని దాని ఉద్దేశం అందుచేత కొన్ని వెకిలి చేష్టలు కూడా చేస్తూవుండేది.

ఆ రోజు సోమవారం. ఆదివారం హాఫ్ డ్యూటీ అవడంచేత – మరుసటి రోజు కాస్త తొందరగానే హాస్పటలుకు వెళ్లాను. ఆ వార్డుకి నేనే యిన్‌చార్జి అవడం

చేత - క్రొత్త డాక్టరు చాలా స్ట్రిక్టు అని తెలిసి వార్డు అంతా పరిశుభ్రంగా వుంచాను. సరిగ్గా పది గంటలకు డాక్టరు హాస్పటలకు వచ్చారు. ఆ రోజు నా వార్డులో ఒక పేషెంటుకు మేజరు ఆపరేషను జరగవలసి వుంది. అందుచేత డాక్టరుగారు సరాసరి ఆపరేషను థియేటరకు వెళ్లారు. నేను పేషెంటును రెడీ చేసి ఆపరేషను థియేటరులోనికి తీసుకు వెళ్లాను.

పేషెంటుకు డాక్టరుగారు క్లోరోఫారం యిచ్చారు.

'స్కార్ ఫెల్' అన్నారు డాక్టరు. అందిచ్చాను.

'టాంగ్స్' అన్నారు. అందించాను.

కాని ఆ గొంతు ఎక్కడో విన్నట్లు వుంది. ముఖమెత్తి చూచాను. ముఖానికి గుడ్డ కట్టివుంది. మంచి కళ్ళు - విశాల మైన నుదురు - మొత్తానికి అందగాడే అయివుంటాడు. కాని అతని గొంతు విన్నప్పుడల్లా ఏదో దిగులుగా వుండేది ఆపరేషను అయిపోయింది.

పేషెంటు లేవగానే ఒక కప్పు హార్లిక్సు యిమ్మని చెప్పి డాక్టరు వెళ్ళి పోయారు. పరధ్యానంలో ఉన్న నాకు పేషెంటు మూలుగు వినిపించేదాక తెలివి రాలేదు. వెంటనే లేచి హార్లిక్సు యిచ్చాను. కాని పేషెంటు త్రాగకుండా బాధ పడుతున్నాడు. నొప్పి నొప్పి అని అరవడం మొదలుపెట్టాడు. వెంటనే డాక్టరును పిలవడానికి వెళ్లాను. అప్పుడు చూసాను డాక్టరుని! అతనే!! ఎంత మార్పు మనిషిలో - ఎంత అందంగా తయారయ్యాడు భీమశంకరాన్ని చూడడంతోటే నాలో ఏదో జరిగి పోయింది. నోట మాటరాలేదు వచ్చిన పని మరచిపోయాను

"యస్-సిస్టర్! ఎలా వున్నాడు పేషెంటు?" అనేదాక నాకు స్మృతి లేదు

"వెంటనే రండి డాక్టరుగారు. పేషెంటు అల్లరి పెడుతున్నా" డని అన్నాను భీమశంకరం నాకేసి అదోలా చూస్తూ లేచాడు. అంతవరకు అతడ్నే చూస్తున్న నేను వెంటనే తల వంచు కున్నాను డాక్టరు, నేను వెళ్లేసరికి పేషెంటు కాళ్ళు చేతులు లాక్కుం టున్నాడు - ఆయాసం ఎక్కువయింది, మరో గంటలో ప్రాణం వదిలాడు.

మెడికల్ బోర్డులో డాక్టరుది ఏమీ తప్పులేదని, ఆపరేషన్ అంతా సక్రమం గానే జరిగిందని - కాని ఆపరేషను అనంతరం పేషెంటు తెలివికి వచ్చాక కాస్త జాగ్రత్త పడివుంటే - పేషెంటు బ్రతికివుండే అవకాశం వుండేదని, ఆ అజాగ్రత్తకు కారణం నేనవడంచేత నన్ను సస్పెండు చేయవలసిందని ఆర్డర్సు పాస్‌చేశారు. సస్పెన్సను ఆర్డరు

వచ్చేవరకూ మా అమ్మకు నేనా సంగతి చెప్పలేదు. మా అమ్మ ఆ మాట విని దిగాలుగా కూర్చుంది. భీమశంకరం సంగతి కూడా మా అమ్మకు చెప్పలేదు. నేను హాస్పిటలుకు వెళ్ళి రెండు రోజు లయింది.

సాయంత్రం ఆరు గంటలకు ఎవరో తలుపు తడుతున్నారు. తలుపు తీసే టప్పటికి - అత్తయ్యా అంటూ భీమ శంకరం సరాసరి లోపలకు వచ్చాడు. మా అమ్మ నిర్ఘాంత పోయింది. తా నెప్పుడో చిన్నప్పుడు చూసిన భీమ శంకరానికి - యిప్పుడు డాక్టరు పి. బి. శంకరానికి ఏమీ సంబంధం లేదు. తిన్నగా వచ్చి మా అమ్మ కాళ్ళకు నమ స్కారము చేశాడు. లేచేటప్పటికి అతని కళ్ళల్లో నీళ్ళున్నాయి. "ఏమిటత్తయ్యా! యిలాంటి పని చేశారు. ఒక ఉత్తర మన్నా వ్రాయకూడదా - మామయ్య పోయినప్పుడు వ్రాశారు, అంతే. తరువాత ఎన్ని ఉత్తరాలకు సమాధానం రాకపోయేప్పటికి ఏ సంగతి తెలియక చాలా దిగులు పడ్డాను. తరువాత డాక్టరుపరీక్ష ప్యాసయ్యాక ఒకసారి భీమవరం వెళ్లాను, మిమ్మల్ని చూడాలని. అప్పుడు తెలిసింది మీరు ఆ వూరు వదలి వెళ్లిపోయారని. సావిత్రి కూడా ఛదువుకుంటుందని విన్నాను. ఇవ్వాళ సావిత్రికి సస్పెన్షన్ ఆర్డరు వచ్చింది. పాపం తన లోపం ఏమీ లేదు. పేషెంటు చాలా నీరస స్థితిలో ఉన్నాడని, ఆపరేషన్ టేబుల్ మీదే చనిపోయే అవ కాశం వుందని నేను ముందే పేషెంటు తరఫు వారికి తెలియజేసి నేను వారివద్ద అంతకు ముందే తీసుకున్న సమ్మత పత్రాన్ని బోర్డు వారికి చూపించాను కూడా_అయినా పేషెంటు ఎవరో మంత్రిగారికి సంబంధించిన వాడట_ అందుకని ఈ మాత్రం అన్నా యాక్షన్ తీసుకోపోతే బాగుండదని అలా చేశారు. పాపం సావిత్రి కేమీ తెలియదు. ఈ సంగతి సావిత్రికి చెబుదామని రెండు రోజుల నుండి చూస్తున్నాను. సావిత్రి హాస్పిటల్ ప్రక్కకన్నా రావడం మానే సింది. అడ్రసు కోసమని రిజిష్టరు తీసి చూశా_అప్పుడు గాని తెలియలేదత్తయ్యా సావిత్రిఎవరో నిన్ను చూడగానే పోల్చుకో లేకపోయినందుకు నన్ను క్షమించు సావిత్రీ" అన్నాడు నాకేసి చూస్తూ. నాకు గుండె చెరువై పోయింది ఏమీ చెయ్య లేక ఏడుస్తూ నిలబడి పోయాను.

"సరేలెండి అయిపోయిందేదో అయిపోయింది. ఇక నుంచి సావిత్రి పని లోకి వెళ్ళక్కర లేదత్తయ్యా మీరు ఈ కొంపలో ఎందుకు. నాకు పెద్ద క్వార్టర్సు వుంది అక్కడకు వచ్చేయండి. నేను వంటరి వాడ్నే కదా" అంటూ అమ్మ ఎంత వద్దని చెప్పినా వినకుండా బలవంతంగా ఆ రోజే మమ్మల్ని తన

క్వార్టర్సుకి చేర్చాడు. మళ్ళీ నన్ను ఉద్యోగం కూడా చేయనివ్వలేదు. నెల రోజులు గడిచాయి. ఈ లోగా భీమ శంక రానికి నాకు ఒక విధమైన ప్రేమ ఏర్పడంది.

ఒక రోజు అమ్మ పేరట ఒక ఉత్తరం వచ్చింది. దానిని అమ్మ చదివి కన్నీళ్ళతో నాకేసి చూచి "యిందుకే అప్పుడే చెపితే విన్నాడు కాదు భీమశంకరం.- ఎంత అద్రదిష్ట—ఉత్తరం తీసి చదివాను. మిస్. రాణి మా అమ్మ పేరట వ్రాసిన ఉత్తర మిది. నాకూ డాక్టరుగారికీ ఏదో సంబంధం ఉందని—అందుకే డాక్టరు గారు నన్ను ఉద్యోగం మాన్పించి యింటిలో పెట్టుకున్నారని యింకా ఏదో ఏదో వ్రాసింది. మరుసటి రోజు భీమశంకరం చాలా కోపంగా వచ్చాడు యింటికి. హాస్ప టల్ గోడల నిండా మా యిద్దరి గురించి ఏవో వ్రాశారట. వెంటనే మా అమ్మ చెప్పింది—"నాయనా! యిక యిక్కడ వుండడం బాగొదు. మేము వెళ్ళిపోతాం నీకు వీలుపడితే ఏ వూళ్ళో నైనా దానికో ఉద్యోగం చూచి పెట్టు ఇంత అపవాదు వచ్చాక మేము ఈ వూళ్ళో ఉండడం మంచిది కాదు—రేపే మమ్మల్ని హైదరా బాద్ పంపించు కొంత కాలం మా పెద్ద మ్మాయి దగ్గర ఉండి వస్తా మన్నది. పాపం భీమశంకరం ఏమీ మాట్లాడ లేకపోయాడు. తల వంచుకొని ఏ సమాధానం చెప్పకుండానే వెళ్లి పోయాడు,

ఆ రాత్రి నన్ను పిలిచాడు ఏకాంతంగా. "సావిత్రీ నన్ను పెళ్ళి చేసుకుంటావా?" గుండె బేజా రెత్తింది. అమ్మయ్యో! విధ వను నాకు పెళ్ళా!—మళ్ళీ పెళ్ళా! కాళ్ళూ చేతులు వణికాయి—నరాలన్నీ ఒక్కసారి తెగిపోయాయి—బావురు మని ఏడ్చేశాను. చెప్పు సావిత్రి—నువ్వు మాట యిచ్చా వంటే అత్తయ్యను కూడా అడుగుతాను.

మా అమ్మను ఎలా ఒప్పించాడో నాకు తెలియదు. పెళ్ళికి మా వాళ్ళెవరూ రాలేదు. హాస్పటల్ స్టాఫ్ అంతా వచ్చారు

సాయంత్రం అయిదు గంటలకు ఆయన యింటికి వచ్చారు. చేతిలో ఏదో పొట్లముంది. అదేమిటన్నాను—చెప్పుకో చూద్దాము — చెప్పుకుంటే నీకిచ్చేస్తా నన్నాడు ఎంత సేపటికి చెప్పలేక పోయాను పొట్లంవిప్పి-పెద్దమల్లెపువ్వుల చెండుతీసి నా తలలో పెట్టారు ఇంత కాలానికి పువ్వులు పెట్టుకొనే భాగ్యం కలిగించినందుకు భగవంతునికి ఎన్నో నమస్కారాలు.

పురాణాల్లో సావిత్రి తన భర్తను సాధించి తెచ్చుకున్న సంగతి జ్ఞాపక మొచ్చి ఆయన ఒళ్ళో ఒరిగి పోయాను.